కల్లాల్లో ధాన్యం.. కళ్లల్లో దైన్యం

- ధాన్యం తరలింపునకు సంచులు నిల్
- తరుగు పేరుతో రైతును నిండా ముంచుతున్న వైనం

పాలకొల్లు సెంట్రల్: ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందేసరికి ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడి రైతులు నష్టపోతుంటారు. ప్రకృతి వైపరీత్యాన్ని భగవంతుడు కూడా ఆపలేని పరిస్థితి. కూటమి ప్రభుత్వ ప్పిదంతో కళ్లముందే చేతులారా నష్టపోతున్న రైతుల పరిస్థితిని ఏమనాలి. ప్రస్తుతం పాలకొల్లు నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో రైతులు అధికారుల తప్పిదంతో రెండు రోజులు క్రితం కురిసిన వర్షానికి కుదేలైపోయారు. ధాన్యం కోసి రెండు వారాలు కావస్తున్నా కూటమి ప్రభుత్వం సంచులు ఇవ్వలేకపోవడంతో రైతులు కల్లాల్లో కన్నీళ్లతో విలవిల్లాడుతున్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యం వర్షానికి తడిచిపోయి రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారు. తడిచిన ధాన్యం మళ్లీ అరబెట్టి పట్టుబడి పట్టాలంటే మరింత తరుగు వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

తరుగు పేరుతో మోసం

ధాన్యం పట్టుబడి చేయాల్సిన రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు వచ్చి ధాన్యం సంచిలో కాటా 40.600 కేజీలు పట్టుబడి చేయాలని సూచిస్తున్నారు. కానీ అలా ఉన్నతాధికారులు చెప్పి వెళ్లిన తరువాత స్థానిక అధికారులు 41.200 కేజీలు పట్టుబడి చేయాలని పట్టుబడుతున్నారు. రైతులందరూ 41.200 కేజీలే పట్టుబడి చేస్తున్నారు. 40 కేజీలు వడ్లు, 600 గ్రాములు సంచి తరుగు తీస్తున్నారు. మరి మరో 600 గ్రాములు ఎవరి ఖాతాలోకి వెళుతున్నాయో? ఏ రైతుకు అంతు చిక్కడం లేదు. పట్టుబడి పట్టిన బస్తాలు ట్రాక్టర్లలోకి ఎక్కిస్తుంటే సంచులు చిల్లులు వల్ల వడ్లు కారిపోయి, బస్తాలు పగిలిపోయి, కుట్లు విడిపోయి వడ్లన్నీ రోడ్డుపై పడిపోతున్నాయి. ఇక్కడ పట్టుబడి పట్టినప్పుడు కాటా సరిపోతున్నా మిల్లుకు వెళ్లే సరికి కాటా తరిగిపోతుంది. ఆ నష్టం అంతా రైతుల ఖాతాల నుంచే తగ్గించేస్తున్నారు. దీనిపై ఎవ్వరూ స్పందించడం లేదు అడగడం లేదు.

చిల్లుల సంచులతో ఇబ్బందులు

చిల్లులు సంచుల్లో వడ్లను మిల్లులకు సరఫరా చేయాల్సి రావడంతో ధాన్యం పట్టుబడి చేసి లోడు చేస్తున్నప్పుడు బస్తాలు పగిలిపోతున్నాయి. అలాగే లోడు పూర్తయిన తర్వాత పగ్గాలు గట్టిగా కట్టి ట్రాక్టర్లను కల్లంలో నుండి రోడ్డుమీదకు తీసుకువస్తున్నారు. సంచులు చిల్లులు వల్ల నెమ్మదిగా వడ్లు కారిపోయి సంచులు ఖాళీ అవుతున్నాయి. దాంతో బస్తా బరువు తగ్గిపోతుంది. అలాగే వాహనంలో ఉన్న బస్తాల నెట్టు కిందకు దిగిపోతుంది. అప్పుడు పగ్గం లూజు అయ్యి లోడు మొత్తం రోడ్లపై పడిపోతుంది. దానివల్ల రైతుకు ఇదో అదనపు ఖర్చు భారం, నష్టం వాటిల్లుతుంది. ఇన్ని కష్టాలు రైతు ఒక్కడే పడుతున్నాడు. 41.200 కేజీలు పట్టుబడి చేయించి తేమ శాతం చూసి ఆర్‌బీకే వద్ద వదులుతున్నారు. మధ్యలో రైతు ఎంత నష్టపోయినా మిల్లుకు వెళ్లే సరికి తరుగు, తేమ శాతం చూసి అక్కడ ఎంత వస్తే అంతే నికరం చేసుకుని రైతుకు కోత విధిస్తున్నారు.



చిల్లుల సంచుల వల్ల ట్రాక్టర్ పగ్గం లూజు అవ్వడంతో రోడ్డుపై పడిపోయిన బస్తాలు



తడిచిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతుల కూలీలు

13 రోజులైనా సంచులు ఇవ్వలేదు



వాలమర్రు గ్రామంలో పది ఎకరాలు, అరట్లకట్ట గ్రామంలో పది ఎకరాలు భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. వాలమర్రు గ్రామంలో పది ఎకరాలు పంట కోసి 13 రోజులు అయ్యింది. కోతకోసిన పది రోజులు తరువాత రైతు భరోసా కేంద్రంలో సంచులు ఇచ్చారు. ఆ సంచులు కూడా ఎక్కడికక్కడ చిరిగిపోయి ఉంటున్నాయి. సంచులివ్వడం ఆలస్యం కావడంతో నా ధాన్యంలో చాలా శాతం తడిచిపోయింది. సమయానికి సంచులిస్తే నష్టపోయేవాడిని కాదు.

– ఎస్.శివన్నారాయణ, రైతు, అరట్లకట్ట

అకాల వర్షంతో నష్టం



ప్రభుత్వం సకాలంలో సంచులు ఇవ్వకపోవడంతో రైతులు అకాల వర్షానికి తీవ్రంగా నష్టపోయారు. ఇస్తున్న సంచులు నాణ్యంగా లేకపోవడంతో సగం వడ్లు నేలపాలు అవుతున్నాయి. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. మిల్లర్లు తడిచిన ధాన్యం వంకతో తేమ శాతం రూపంలో, ధాన్యం ముక్క అవుతుందనే సాకుతో ఇలా పలు రకాలుగా రైతులను ఇబ్బందులకు గురిచేసి దోచుకుంటున్నారు.

– నడపన గోవిందరాజులు నాయుడు, పాలకొల్లు జెడ్పీటీసీ సభ్యుడు

600 గ్రాములు అదనంగా తీసుకుంటున్నారు



నాకు చిక్కాల్లో ఓ రెండు ఎకరాలు భూమి ఉంది. ఇక్కడ ఒక ఎకరం సాగు చేస్తున్నాను. చిక్కాల్లో సంచులు బాగానే ఇచ్చారు. ఇక్కడే సంచులు ఇవ్వడానికి చాలా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కాటా అయితే 41.200 కేజీలు పట్టుబడి చేయాలని అంటున్నారు. 40 కేజీలు ధాన్యం, 600 గ్రాములు సంచి తరుగు, మరి మిగిలిన 600 గ్రాములు ఎందుకు పట్టిస్తున్నారో అర్థం కావడం లేదు.

– డి సూరిబాబు, వాలమర్రు

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నవ్య జీవన్

పాలకొల్లు సెంట్రల్: యుక్త వయస్సులో బాలికలు తమ ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని డాక్టర్ ఎం నవ్య జీవన అన్నారు. మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సందర్భంగా కిశోర్ వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నవ్య మాట్లాడుతూ కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పి.ఎలిజిబెత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి పాల్గొన్నారు. అలాగే మండలంలోని దిగమర్రు, కొత్తపేట సచివాలయం, పట్టణంలో 10 వార్డులో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పులకండం సత్యవేణి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీపీయూ ప్రొటెక్షన్ ఆఫీసర్ మమత, బత్తుల మేరీ నిర్మలా కుమారి పాల్గొన్నారు.

ఆచంటలో..

పెనుగొండ: కిశోర వికాసంతో బాలికలకు చట్టాల పైనా, సమాజంపైనా అవగాహన పెరుగుతుందని ఆచంట మహిళా పోలీసు సీహెచ్ మైత్రి అన్నారు. మంగళవారం ఆచంట ముత్యాలమ్మ చెరువుగట్టు వద్ద అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర్ వికాసంపై బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వైట్ల ఉషారాణి, లక్ష్మీ, జ్యోతి పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: ఆరోగ్యానికి వ్యక్తిగత శుభ్రత ముఖ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా అన్నారు. కిశోర వికాసం కార్యక్రమం రెండో రోజు మంగళవారం యలమంచిలి సచివాలయంలో సర్పంచ్ బర్రే మేరీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఎస్‌జే సత్యవతి, ఏఎన్ఎం వి.దుర్గ, ఎంఎస్‌కే ఎం.స్నేహ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెనుమంచిలిలో అగ్ని ప్రమాదం



అగ్ని ప్రమాదానికి గురైన ఇల్లు

పెనుగొండ: ఆచంట మండలం పెనుమంచిలిలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పాలపర్తి కృష్ణ కిషోర్ కుటుంబం పూర్తిగా నిరాశ్రయులయ్యారు. కృష్ణకిషోర్ రేకుల షెడ్డు ఇంటిలో కాఫీ హోటల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలువ్యాపించడంతో మంటలు అదుపు చేయడానికి ప్రయత్నించినా సుమారు రూ.4లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. రూ.70వేల నగదుతో పాటు, ఇంటిలో సామగ్రి ఏసీ, హోటల్‌కు సంబంధించిన సామగ్రి పూర్తిగా దగ్ధమైంది.

కార్మిక సమ్మెను విజయవంతం చేయాలి



ఆశ కార్యకర్తలతో మాట్లాడుతున్న శ్రీనివాస్

పాలకొల్లు సెంట్రల్: కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను యజమానులకు అనుకూలంగా మార్చేందుకు లేబర్ కోడ్స్ తెచ్చారని సీఐటీయూ నాయకుడు జవ్వాది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని లంకలకోడేరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ. 26 వేలు చేయాలని డిమాండ్ చేశారు.

ఎల్బీచర్లలో..

నరసాపురం రూరల్: ఆశావర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండంలోని ఎల్బీచర్ల, తూర్పుతాళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు

నరసాపురం: నరసాపురం గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో మంగళవారం పిల్లలకు నీతి కథలు చెప్పారు. అలాగే పిల్లలతో తెలుగు అధ్యాపకులు పద్యాలు చదివించారు. తెలుగు టు ఇంగ్లీష్ ట్రాన్స్‌లేషన్, యోగా, చెస్ వంటి ఆటలు నేర్పించారు. ఈ వేసవి విజ్ఞాన తరగతులకు మంచి స్పందన వస్తోందని, ప్రతిరోజూ తరగతులకు వచ్చేవారి సంఖ్య పెరుగుతుందని లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి చెప్పారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్ట్

భీమవరం: పట్టణ పరిధిలోని బీవీరాజు విగ్రహం సమీపంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న వీరమల్లు భాస్కరరావు అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు భీమవరం ఎక్సైజ్ సీఐ కె.బలరామరాజు మంగళవారం తెలిపారు. అతని వద్ద నుంచి 7 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని తెలిపారు. దాడుల్లో ఎస్సైలు పి.ఉమామహేశ్వరరావు, పి.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

డ్రెయిన్లలో మురుగు తొలగింపు

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లోని డ్రెయిన్లలో పేరుకుపోయిన మురుగును గత రెండు రోజులుగా తొలగిస్తున్నారు. స్థానిక ప్రధాన రహదారి వెంబడి ఉన్న డ్రెయిన్‌లో భారీగా మురుగును బయటకు తీశారు. పలు వీధుల్లో ఆయా కౌన్సిలర్ల పర్యవేక్షణలో చైర్‌పర్సన్ జామి హైమావతి సమక్షంలో మురుగు తొలగింపు జరుగుతోంది. మంగళవారం స్థానిక జవహర్‌పేటలోనూ, మూలలంక బోదె ప్రాంతంలో మురుగు తొలగింపు చర్యలను చైర్‌పర్సన్ హైమావతి, విప్ పడాల శ్రీనివాసరెడ్డి పరిశీలించారు.

CHANGE OF NAME

I, SIRRA ASHIRVADAM, resident of D.No 3-46, BALUSULA GOYYI PALEM, THOLERU, W.G.Dt, A.P changed my name SIRRA ASEERVADAM (old name) to SIRRA ASHIRVADAM (new name) hence after all my documents, Passport etc will continue with my new name
SIRRA ASHIRVADAM

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

పాలకొల్లుసెంట్రల్: స్థానిక లాకు సెంటర్ రామాలయం వద్ద ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని పూలపల్లి గ్రామానికి చెందిన వి.రామారావు అనే వ్యక్తి ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మంగళవారం కోర్టు వాయిదాకు వెళ్లే సందర్భంలో లాకు సెంటర్ రామాలయం వద్ద తన ద్విచక్ర వాహనంతో రోడ్డు దాటుతుండగా నరసాపురం నుంచి అతి వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. రామారావును స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాగునీటి కోసం ధర్నా



మల్లవరంలంక సచివాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్తులు.

నరసాపురం రూరల్: గత ఐదు రోజులుగా తాగునీరు ఇవ్వకపోవడంతో మల్లవరం లంక గ్రామంలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకున్న నాథుడే లేడని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మామిడిశెట్టి రామాంజనేయులు అన్నారు. మంగళవారం నరసాపురం మండలం మల్లవరంలంక గ్రామ సచివాలయం వద్ద ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో రామాంజనేయులు మాట్లాడుతూ గ్రామంలో పైపులైన్ పగిలిపోయి ఒకటో వార్డు నుంచి నాల్గవ వార్డు వరకూ గత ఐదు రోజులుగా తాగు నీరు అందడం లేదన్నారు. దీంతో ప్రజలు తాగు నీరులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను నరసాపురం ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లినా మా చే తుల్లో ఏమీ లేదని చేతులెత్తేస్తున్నారన్నారు. నరసాపురం ఆర్డీఓ దాసి రాజు దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే ట్యాంకరు ద్వారా తాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జల్లి రామ్మోహనరావు, కవురు శ్రీనివాసు, కవురు గోపాలకృష్ణ, గుబ్బల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

పాలకొల్లు సెంట్రల్: నరసాపురం మండలం దర్బరేవు గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థిని పూజితకు వసుద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం ఫౌండేషన్ సభ్యులు పృథ్వీరాజ్ రూ. 5 వేలు చెక్కును విద్యార్థి ని బంధువులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో వసుద ఫౌండేషన్ కన్వీనర్ బుద్దరాజు, ప్రసాద్, సుదీర్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో 17 మందికి ఉద్యోగాలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఏపి నైపుణ్య అభివృద్ధి సంస్థ సౌజన్యంతో సంధ్య మెరైన్స్, జగదీష్ మెరైన్స్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 17 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ కారుమూరి నరసింహరావు తెలిపారు. ఈ ప్రాంగణ ఎంపికలో 48 మంది అభ్యర్థులు పాల్గొనగా వారికి మౌఖిక పరీక్షలు నిర్వహించి వారిలో నైపుణ్యం, కమ్యూనికేషన్స్ స్కిల్స్ పరిశీలించి 17 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, కళాశాల సెక్రటరీ కె.వి సీతా రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయంపై అవగాహన

యలమంచిలి: తల్లిదండ్రులు 14 ఏళ్లలోపు పిల్లలందరినీ బడికి పంపాలని ప్యానెల్ న్యాయవాది ఎస్.ఆనంద్‌బాబు చెప్పారు. నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అసంఘటిత రంగంలోని కార్మికులకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం బాడవ గ్రామంలోని ఇటుక బట్టీ కార్మికులకు కార్మిక చట్టాలు, ఈ-శ్రమ్ కార్డు ఉన్న వారికి ప్రభుత్వ పరంగా అందే సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పీఎల్‌వీఎస్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ సమీక్ష

భీమవరం (ప్రకాశం చౌక్): నిర్దేశించిన గృహ నిర్మాణాల లక్ష్యసాధనలో అలసత్వంవహించే అధికారులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి గృహ నిర్మాణ శాఖ అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ గత సంవత్సరం జూన్ 24 నుంచి మే నెలాఖరుకు 9,107 గృహ నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉండగా 3,361 గృహాలు మాత్రమే పూర్తి చేయడంపై అసహనాన్ని వ్యక్తం చేశారు.



వైభవంగా వాసవీమాత జయంత్యుత్సవాలు

పెనుగొండ: ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకపరమేశ్వరి జయంత్యుత్సవాలు వాసవీ మాత జన్మస్థలమైన పెనుగొండలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. మూలవిరాట్ వాసవీ మాత కొలువై ఉన్న శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో శనివారం నుంచి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మంగళవారం వేద పండితులు రామడుగుల నరసింహమూర్తి, ఆలయ ప్రధాన అర్చకుడు కోట వెంకట సుబ్రహ్మణ్యంల ఆధ్వర్యంలో ఉదయం నుంచి నగరేశ్వర స్వామికి రుద్రాభిషేకం, మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవార్లకు కుంకుమార్చనలు, అర్చనలు నిర్వహించారు.



వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో పుష్పార్చన చేస్తున్న అర్చకుడు

లక్ష మల్లి పుష్పార్చన

ఆలయంలో వాసవీ కన్యకపరమేశ్వరి మాతకు లక్ష మల్లికార్చన నిర్వహించారు. సుమారు రెండుగంటలకు పైగా మంత్రోచ్ఛరణలతో లక్ష మల్లికాపుష్పార్చన నిర్వహించారు. లక్ష మల్లికా పుష్పార్చనను తిలకించడానికి భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

102 కన్యల పూజ

మంగళవారం ఉదయం అర్చనలు అనంతరం 102 కన్యలతో ఆలయ ప్రాంగణంలో వాసవీ మాతకు సామూహిక పూజలు నిర్వహించారు. పెనుగొండ పరిసర ప్రాంతాల నుంచి బాలికలు భారీగా తరలి వచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దేవస్థానం శాశ్వత నిత్యాన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో పూజల్లో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గుబ్బల రామపెద్దింట్లురావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘాల నాయకులు కట్టా సత్తిబాబు, యువజన సంఘాల నాయకులు ఉద్దగిరి శ్రీధర్(దత్తు) తదితరులు పాల్గొన్నారు.

నేడు వాసవీ జయంతి

వాసవీ కన్యకపరమేశ్వరి జయంతిని బుధవారం నిర్వహించడానికి మూలవిరాట్ కొలువై ఉన్న శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలోనూ, అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధామ్‌లోనూ నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పెనుగొండ గ్రామంలోనే ప్రధాన రహదారిలో జై వాసవీ తోరణాలు ఏర్పాటు చేసి ఆధ్యాత్మిక శోభను తీసుకు వచ్చారు. బుధవారం ఉదయం పెనుగొండ బజారు రోడ్డులో గ్రామోత్సవం, అమ్మవారికి అభిషేకాలు, వాసవీ హోమం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.



వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో 102 కన్యల పూజ నిర్వహిస్తున్న దృశ్యం